సాక్షి
అనంతపురం

బుధవారం ౹ 18 ౹ అక్టోబర్ ౹ 2023



చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.22 వేలు పలికాయి.



టమాట కిలో రూ.10

కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్ట ధర రూ.10 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.8 ప్రకారం క్రయ విక్రయాలు సాగాయి.

గరిష్ఠం/కనిష్ఠం

37.5°/22.6°

జిల్లా అంతటా మంగళవారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం తగ్గింది. ఉక్కపోత నెలకొంది. ఆగ్నేయం దిశగా గంటకు 4 నుంచి 6 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

రేపు ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రాక



అనంతపురం కార్పొరేషన్: వైఎస్సార్‌సీపీ రీజినల్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఈ నెల 19న అనంతపురం రానున్నారు. ఈ మేరకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయం మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అదే రోజున కేటీఆర్ కన్వెన్షన్ హాలులో పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలు, పరిశీలకులు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులతో సామాజిక న్యాయభేరి బస్సు యాత్ర, 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాలపై ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపింది.

19, 20 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు



గుంతకల్లు: ఈ నెల 19, 20 తేదీల్లో సికింద్రాబాద్-తిరుపతి మధ్య ప్రత్యేక ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడవనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ సీహెచ్ రాకేష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గురువారం రాత్రి 8.00 గంటలకు సికింద్రాబాద్ జంక్షన్‌లో బయలుదేరి శుక్రవారం ఉదయం 9 గంటలకు తిరుపతి చేరుకుంటుంది. తిరిగి ఈ రైలు (07042) శుక్రవారం సాయంత్రం 7.55 గంటలకు తిరుపతి జంక్షన్‌లో బయలుదేరి శనివారం ఉదయం 9.30 గంటలకు సికింద్రాబాద్ చేరుతుంది. ఈ రైలు కాచిగూడ, షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, వనపర్తిరోడ్డు, గద్వాల్, రాయచూర్, మంత్రాలయం, గుంతకల్లు, తాడిపత్రి, యర్రగుంట్ల, కడప, రాజంపేట, రేణిగుంట మీదుగా రాకపోకలు సాగిస్తుంది.

భూసేకరణ వేగవంతం చేయండి



మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రాజెక్టుల ఏర్పాటులో కీలకమైన భూసేకరణ ప్రక్రియ వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారులు, రైల్వే, ఏపీఐఐసీ, ఆర్ అండ్‌బీ, అహుడా, పవర్ గ్రిడ్, ఆర్అండ్ఆర్, తదితర ప్రాజెక్టులకు సంబంధించి భూసేకరణ అంశంపై జేసీ మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టులు గడువులోగా పూర్తి కావాలంటే ప్రధానంగా వాటికి అవసరమైన భూసేకరణ జరగాలన్నారు. జిల్లాలో వివిధ ప్రాజెక్టులకు అవసరమైన భూమిని సేకరించే విషయంలో ఆలస్యానికి తావివ్వరాదన్నారు. సమావేశంలో ఆర్డీఓలు నిషాంత్‌రెడ్డి, రవీంద్ర, మధుసూదన్, డిప్యూటీ కలెక్టర్ సుధారాణి, అహుడా కార్యదర్శి చిన్నయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు రాయదుర్గంలో 'జగనన్నకు చెబుదాం'

అనంతపురం అర్బన్: జగనన్నకు చెబుదాం-స్పందన మండలస్థాయి కార్యక్రమాన్ని బుధవారం రాయదుర్గంలో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి ఓ ప్రకటనలో తెలిపారు. స్థానిక డ్వామా ఏపీడీ కార్యాలయంలో ఉదయం పది గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి నేడు ఇంటర్వ్యూలు



అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని ఇంగ్లిష్, మేథమేటిక్స్, బోటనీ విభాగాల్లో అకడమిక్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి బుధవారం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కృష్ణకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆయా విభాగాల్లో నిర్వహించే ఇంటర్వ్యూలకు నేరుగా హాజరు కావచ్చని పేర్కొన్నారు. అభ్యర్థులు సంబంధిత విభాగాల్లో పీహెచ్‌డీ గానీ నెట్ (నేషనల్ ఎలిజిబులిటీ టెస్ట్), సెట్ (స్టేట్ ఎలిజిబులిటీ టెస్ట్)లో అర్హత పొంది ఉండాలన్నారు. రెజ్యూమ్‌తో పాటు సర్టిఫికెట్లు ఒక సెట్ జిరాక్స్ కాపీలను తీసుకురావాలని కోరారు. బోటనీ విభాగం వారికి మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు, ఇంగ్లిష్ విభాగంలో 3 నుంచి 4 గంటల వరకు, మేథమేటిక్స్ విభాగంలో సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

ప్రణాళిక.. ఉపాధి చకచకా

- పనుల గుర్తింపునకు ముమ్మరంగా గ్రామసభలు
- ప్రతి పంచాయతీలో 20కి మించకుండా పనులు
- ఎప్పటికప్పుడు కూలి చెల్లింపులు
- ఉన్న ఊరిలోనే కూలీలకు ఉపాధి



గుమ్మఘట్ట మండలం భూపసముద్రం వద్ద పనులు చేస్తున్న ఉపాధి కూలీలు (ఫైల్)

రాయదుర్గం: వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి ఉపాధిహామీ పథకంలో కసరత్తు మొదలైంది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2024-25)లో చేపట్టాల్సిన ఉపాధి పనులపై బడ్జెట్ ప్రణాళికలు సిద్ధం చేసే ప్రక్రియ ముమ్మరమైంది. అక్టోబర్ 2న గాంధీ జయంతి పురస్కరించుకుని జిల్లాలో గ్రామసభల నిర్వహణకు అధికారులు శ్రీకారం చుట్టారు. ఉన్న ఊర్లోనే అడిగిన వారందరికీ ఉపాధి హామీ పనులు కల్పించేలా ముందస్తు ప్రణాళికలు చేపట్టారు.

పనులకు ఆమోదం ఇలా...

జిల్లాలో 577 గ్రామ పంచాయతీల్లో సభల నిర్వహణ నవంబర్ 30 నాటికి పూర్తిచేస్తారు. తర్వాత డిసెంబర్ 31 నాటికి పూర్తి ప్రణాళికను ప్రభుత్వానికి నివేదించడానికి కసరత్తు చేస్తున్నారు. గ్రామస్థాయిలో పూర్తిచేసిన ప్రణాళికను మండల పరిషత్, ఆ తర్వాత జిల్లా పరిషత్‌కు పంపిస్తారు. వచ్చే ఏడాది మార్చి 31 వరకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ఆమోదించిన 1.08 కోట్ల పనిదినాలు చేపడతారు. వీటిలో ఇప్పటికే 88 వేల పనిదినాలు పూర్తి కావచ్చాయి. మిగిలిన పనులు 2024 మార్చి 31లోగా పూర్తి చేయాల్సి ఉంది. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పనులు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే విధంగా కార్యాచరణ రూపొందించారు.

పనుల్లో పారదర్శకత

ఉపాధి హామీ పనుల్లో పారదర్శకత పాటిస్తున్నారు. ఇష్టారాజ్యంగా చేపట్టే పనుల గుర్తింపునకు స్వస్తి పలికారు. జిల్లాలో మొత్తం 210 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉండగా, కేంద్రం జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం ఒక్కో గ్రామ పంచాయతీలో 20కి మించకుండా పనులు గుర్తించాల్సి ఉంది. మొదట ఆ పనులు పూర్తిచేశాకే కొత్త పనులు చేపట్టేలా కఠినమైన నిబంధనలు అమల్లోకి తీసుకొచ్చారు.

భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం

వచ్చే ఆర్థిక సంవత్సరంలో 17 విభాగాల్లో వివిధ రకాల పనులు చేపట్టడానికి అవకాశాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. నవంబర్‌లో రెండో దశ గ్రామసభలు నిర్వహించి పనుల ఆమోదానికి తీర్మానం తీసుకునేందుకు ఏర్పాట్లు ముమ్మరం చేస్తున్నారు. భూగర్భ జలాల పెంపునకు ప్రాధాన్యం ఇచ్చేలా ప్రణాళికలు తయారు చేస్తున్నారు. చెరువులు, కాలువల్లో పూడికతీత, పిచ్చి మొక్కలు, పొదలు తొలగించడం, నీటి కుంటల నిర్మాణం, కందకాలు, సమాంతర కందకాలు తవ్వడం, అంతర్గత మట్టి రోడ్లు, మొక్కలు, పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత కల్పించే దిశగా ప్రణాళికలు చేపట్టారు.

జిల్లాలో గ్రామ పంచాయతీలు	577
జాబ్‌కార్డులు	2.60 లక్షలు
పనులకెళ్లే కూలీలు	4.64 లక్షలు
2023-24లో పనిదినాల లక్ష్యం	1.08 కోట్లు
ఇప్పటికే పూర్తయిన పనిదినాలు	88 వేలు

ఊర్లోనే పని కల్పిస్తున్నారు



ఉపాధి పనులు మాలాంటి పేదలను ఆదుకుంటున్నాయి. ఈ ఏడాది చెరువులో 'అమృత్ సరోవర్' కార్యక్రమం ద్వారా పూడిక తీత పనులు చేపట్టారు. ఊర్లోనే అనువైన పని లభించింది. చాలా మంది వంద రోజుల పనిదినాలు ఇక్కడే పూర్తి చేసుకున్నారు. ప్రభుత్వం సకాలంలో కూలి వేతనం చెల్లించింది. వచ్చే ఏడాది కూడా ఇలాంటి పూడిక తీసే పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి. ఈ పనులు చేపట్టడంతో కూలీలతో పాటు రైతులకు ప్రయోజనం చేకూరుతుంది.

– వి.లక్ష్మి, ఉపాధి కూలీ, భూపసముద్రం

గడువులోగా నివేదికలు



వచ్చే 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి హామీ పనులకు సంబంధించిన ప్రణాళికలను గ్రామసభల ద్వారా గుర్తిస్తున్నాం. గ్రామ పంచాయతీ, మండల పరిషత్‌లో తీర్మానాలు పూర్తికాగానే జిల్లా ప్రణాళిక సిద్ధం చేసి కలెక్టర్‌కు నివేదిస్తాం. అక్కడి నుంచి ప్రభుత్వానికి పంపి లక్ష్యం మేరకు పనిదినాలు ఖరారు చేసేలా కృషి చేస్తాం. వర్షాభావ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది కూలీల సంఖ్య మరింత పెంచేలా చర్యలు చేపట్టాం.

– వేణుగోపాల్‌రెడ్డి, పీడీ, జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా)

అన్నపూర్ణేశ్వరీ నమోనమః



ఉరవకొండలో అన్నపూర్ణేశ్వరిగా ఉరగాద్రి చౌడేశ్వరి అమ్మవారు

జిల్లా అంతటా శరన్నవరాత్రులు వైభవంగా సాగుతున్నాయి. మూడో రోజు మంగళవారం అమ్మవారు అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రసాదాలు వితరణ చేశారు. – సాక్షి నెట్‌వర్క్

హాకీలో ఏపీ జట్టు శుభారంభం



గెలుపొందిన ఏపీ జట్టు

అనంతపురం: హాకీ ఇండియా ఆధ్వర్యంలో చెన్నై వేదికగా జరుగుతున్న సబ్ జూనియర్ సౌత్ జోన్ హాకీ చాంపియన్‌షిప్-2023లో ఏపీ జట్టు శుభారంభం చేసింది. మంగళవారం కేరళతో తలపడిన ఏపీ జట్టు 11-2 గోల్స్ తేడాతో ఘన విజయాన్ని సాధించింది. జట్టులో అనంతపురంలోని ఆర్డీటీ క్రీడాకారులు శ్రీవిద్య 7, తులసి 3, ముజియా బేగం 1 గోల్స్ సాధించడం గమనార్హం.

'సురక్ష'కు విశేష స్పందన

- 35 చోట్ల వైద్య శిబిరాలు
- 11,859 మందికి ఓపీ సేవలు
- ఉచితంగా కార్పొరేట్ వైద్యం





బోరంపల్లిలో వైద్య శిబిరానికి వచ్చిన వృద్ధురాలితో మాట్లాడుతున్న మంత్రి ఉషశ్రీ చరణ్, అనంతపురంలో వైద్యశిబిరానికి వచ్చిన జనం

అనంతపురం మెడికల్: రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా కొనసాగుతోంది. మంగళవారం జిల్లాలోని 35 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు. 140 మంది వైద్యులు, వందల సంఖ్యలో ఆరోగ్య సిబ్బంది శిబిరాల్లో సేవలందించారు. మొత్తం 11,859 మంది శిబిరాలకు హాజరై..వైద్యసేవలు పొందారు. వీరిలో 427 మందిని మెరుగైన చికిత్స కోసం జిల్లా, ఏరియా, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. 2,281 మంది కంటి పరీక్షలు చేయించుకున్నారు. కళ్యాణదుర్గం మండలం బోరంపల్లిలో వైద్యశిబిరాన్ని మంత్రి ఉషశ్రీ చరణ్ పరిశీలించారు. అనంతపురం కోర్టు రోడ్డులోని పట్టణ ఆరోగ్య కేంద్రం, అశోక్‌నగర్‌లోని నగర పాలక సంస్థ స్కూల్లో వైద్య శిబిరాలను ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి, గుంతకల్లు నియోజకవర్గం పామిడి మండలం పాళ్యం గ్రామంలో శిబిరాన్ని ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి పరిశీలించారు.

నేడు 28 ప్రాంతాల్లో వైద్య శిబిరాలు

జిల్లాలోని 28 ప్రాంతాల్లో బుధవారం వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి తెలిపారు. అనంతపురం రూరల్-2, కురువల్లి, ఎం.హనుమాపురం, కేశవాపురం, కొత్తపేట, శిరిగెదొడ్డి, గొళ్ల, గొళ్లపల్లి, హారికేర, యనుమలదొడ్డి, హెచ్ సోదనపల్లి, చిన్నయక్కలూరు, బుర్నకుంట, బొందనకల్, తిప్పనపల్లి, భోగసముద్రం, అమిద్యాల, గంగికుంట, వీ కొత్తకోట, వేములపాడు, అనంతపురంలోని కోర్టు రోడ్డు, నీరుగంటి వీధి యూపీహెచ్‌సీ, గుత్తి పట్టణం చెట్నేపల్లి, గుంతకల్లు పట్టణంలోని భాగ్యనగర్, సత్యనారాయణపేట, కళ్యాణదుర్గంలోని ఇందిరమ్మ కాలనీ, రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీకాలనీ, తాడిపత్రిలోని అంబేడ్కర్‌నగర్ యూపీహెచ్‌సీల్లో వైద్య శిబిరాలు ఉంటాయని వెల్లడించారు.

ఆరోగ్య సురక్ష ..ఓ సువర్ణాధ్యాయం

కళ్యాణదుర్గం రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ఓ సువర్ణాధ్యాయమని రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్ అన్నారు. మండల పరిధిలోని బోరంపల్లిలో మంగళవారం నిర్వహించిన ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేద, సామాన్య, మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్య, వైద్య రంగాలకు పెద్దపీట వేశారన్నారు. ఆరోగ్య సురక్ష ద్వారా దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడే వారికి సైతం మెరుగైన వైద్యం అందుతుందన్నారు. శిబిరంలో 290 మందికి వైద్యసేవలు అందించారు. వారికి సరిపడా మందులను ఉచితంగా ఇచ్చారు. అవసరమున్న వారికి కళ్లజోళ్లను మంత్రి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మారుతమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు బొమ్మన్న, ఎంపీడీఓ సాల్మన్, సీడీపీఓ లక్ష్మీ ప్రసన్న, బోరంపల్లి సర్పంచ్ శోభవాణి, ఎంపీటీసీ సభ్యులు తిప్పమ్మ, వాటర్ షెడ్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సర్వోత్తం తదితరులు పాల్గొన్నారు.

కూలి అడిగిందని మహిళా కూలీపై దాడి





బాధితురాలు సావిత్రి, వీపుపై తేలిన వాతలు

యాడికి: కూలి డబ్బులు ఇవ్వండని తోటి కూలీల సమక్షంలో అడిగిన మహిళా కూలీపై భూయజమాని చర్నాకోలుతో దాడిచేశాడు. ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి. చందన గ్రామానికి చెందిన మహిళా రైతుకూలీ సావిత్రి మరో ఐదుగురితో కలిసి గత ఏడాది కావలి రామాంజనేయులు అనే భూ యజమానికి చెందిన పత్తి పంటలో కలుపుతీశారు. అయితే ఇంతవరకూ కూలి చెల్లించలేదు. మంగళవారం ఉదయం సదరు కూలీలు పనులకు వెళ్తున్న సమయంలో రామాంజనేయులు తారసపడ్డాడు. దసరా పండుగ వస్తోందని తమకివ్వాల్సిన కూలి డబ్బులు ఇవ్వండి అంటూ సావిత్రి అడిగింది. అంతమందిలో డబ్బు అడిగేసరికి అవమానంగా భావించిన రామాంజనేయులు ఆగ్రహంతో ఊగిపోయాడు. విచక్షణ మరచి చర్నాకోలు తీసుకుని సావిత్రిపై విరుచుకుపడ్డాడు. అడ్డొచ్చిన తోటి మహిళా కూలీలను పక్కకు తోసేసి మరీ సావిత్రిని వీపుపై ఇష్టానుసారం కొట్టడంతో ఆ భాగంలో వాతలు పడ్డాయి. అనంతరం సావిత్రి యాడికి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసుల నుంచి స్పందన లేకపోవడంతో రాత్రి 7 గంటల సమయంలో గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలందరూ సావిత్రికి మద్దతుగా స్టేషన్‌కు వెళ్లి భూ యజమాని రామాంజనేయులుపై కేసు నమోదు చేయాలని వాగ్వాదానికి దిగారు. దీంతో రామాంజనేయులుపై ఏఎస్‌ఐ వెంకటేశ్వర్లు కేసు నమోదు చేశారు.

సానుభూతి కోసమే టీడీపీ దుష్ప్రచారం



మాట్లాడుతున్న ఎంపీ రంగయ్య (చిత్రంలో) మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి, తదితరులు

కూడేరు: ప్రజల నుంచి సానుభూతి పొందేందుకే రాష్ట్ర ప్రభుత్వంపై, సీఎం వైఎస్ జగన్‌పై ఎల్లో మీడియా ద్వారా టీడీపీ నేతలు దుష్ప్రచారం సాగిస్తున్నారని ఎంపీ తలారి రంగయ్య, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి మండిపడ్డారు. మంగళవారం కూడేరులో జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశంలో వారు పాల్గొని, మాట్లాడారు. అవినీతి కేసులో చంద్రబాబు అరెస్టు కావడంతోనే టీడీపీ పనైపోయిందన్నారు. బాబు అరెస్టుకు నిరసనగా టీడీపీ నేతలు చేపడుతున్న ప్రతి ఆందోళనకూ ప్రజా మద్దతు కరువైందన్నారు. మరో పక్క ఎలాంటి రాజకీయ అవగాహన లేని దత్తపుత్రుడు, జనసేనాని పవన్ కళ్యాణ్ కులాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. వీరి కుట్రలను ఎప్పటికప్పుడు ప్రజలే తిప్పికొడుతున్నారని, రాబోవు ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. 2024లో టీడీపీ, జనసేన కనుమరుగైపోతాయన్నారు. కార్యక్రమంలో టీటీడీ పాలక మండలి సభ్యుడు అశ్వత్థనాయక్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య తదితరులు పాల్గొన్నారు.



మహోన్నత లక్ష్యం.. సజీవ చిత్రం!

'మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం' లక్ష్యం మహోన్నతమైనది. వలసలు నివారించి, ఉన్న ఊళ్లోనే పనులు కల్పించాలన్న సంకల్పంతో జిల్లాలోని బండ్లపల్లిలో దశాబ్దన్నర క్రితం పురుడుపోసుకున్న పథకమిది. 2006 నుంచి నిరాటంకంగా అమలవుతూ ఎందరో పేదల పొట్ట నింపుతోంది. ఈ పథకం ఉద్దేశాలను చాటిచెబుతూ అనంతపురం నగరంలోని అహుడా కార్యాలయానికి వెళ్లే దారిలో ప్రహరీపై చిత్రాలు వేశారు. వాటి ముందే కూలీలు ఇలా పనిచేస్తూ మహోన్నత లక్ష్యానికి దర్పణం పట్టారు.

– జి.వీరేష్, సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

ప్రశాంతంగా నైపుణ్య పరీక్ష


అభ్యర్థిని ఇంటర్వ్యూ చేస్తున్న నైపుణ్య పరీక్ష బోర్డు సభ్యులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఉమ్మడి అనంతపురం జిల్లాలోని భవిత కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహిత విద్య (ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్) రిసోర్స్ పర్సన్ (ఆర్పీ)ల ఎంపిక కోసం మంగళవారం నిర్వహించిన నైపుణ్య పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. సమగ్రశిక్ష కార్యాలయంలో ఏపీసీ నాగరాజు ఆధ్వర్యంలో అభ్యర్థుల నైపుణ్యాన్ని పరీక్ష బోర్డు సభ్యులు పరిశీలించారు. ఎంఆర్ విభాగంలో ఖాళీగా ఉన్న 15 పోస్టులకు గాను 1:3 నిష్పత్తి మేరకు 40 మంది అభ్యర్థులను ఇంటర్వ్యూలకు ఆహ్వానించారు. వీరిలో 38 మంది హాజరయ్యారు. అలాగే వీఐ/హెచ్ఐ విభాగంలో 27 పోస్టులకు గాను 58 మంది అర్హత సాధించగా 57 మంది హాజరయ్యారు. నైపుణ్య పరీక్ష కోసం ఏర్పాటు చేసిన బోర్డులో సమగ్ర శిక్ష అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ నాగరాజు, స్టేట్ సీనియర్ అడ్వయిజర్ ఫర్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ వింగ్ రామ్ కమల్, వికలాంగుల సంక్షేమశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ అబ్దుల్ రసూల్, సమగ్ర శిక్ష అనంతపురం జిల్లా ఐఈ కోఆర్డినేటర్ షమ, శ్రీసత్యసాయి జిల్లా కోఆర్డినేటర్ ఆనంద్ ఉన్నారు.

కరువును పారదోలేలా...

- జీడు భూముల్లో కరువు ప్రూఫింగ్ మోడల్
- ఒక అడుగు భూమిలో ఆరు రకాల పంటల సాగు
- పెట్టుబడి లేకుండా మహిళా రైతుల వినూత్న ప్రయోగం


సీడ్ బాల్‌ను సిద్ధం చేస్తున్న మహిళా రైతు

కళ్యాణదుర్గం: అనంతపురం జిల్లా అంటేనే ఒకప్పుడు కరువుకు నిలయంగా ఉండేది. 2019 తర్వాత మారిన వాతావరణ పరిస్థితులతో జిల్లా వ్యాప్తంగా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు జలకళను సంతరించుకున్నాయి. ఈ క్రమంలో భవిష్యత్తులో కరువు ఛాయలు మళ్లీ అలుముకోకుండా ఉండేలా పలువురు రైతులు పటిష్ట చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా మెట్ట పొలాల్లో పసిడి పంటలు పండించేందుకు సిద్ధమయ్యారు. రైతులు చేపట్టిన కరువు ప్రూఫింగ్ మోడల్‌పై 'సాక్షి' ప్రత్యేక కథనం.

ఆదర్శంగా నిలిచిన మహిళా రైతులు

కళ్యాణదుర్గం మండలంలోని పలు గ్రామాలకు చెందిన మహిళా రైతులు కరువు ప్రూఫింగ్ మోడల్‌పై అవగాహన పెంచుకుని ఆ దిశగా కరువును పారదోలేలా పంటల సాగుకు చర్యలు చేపట్టారు. పూర్తిగా వర్షాధారంపై ఆధారపడిన మెట్ట భూములను ఎంపిక చేసుకుని వివిధ రకాల పంటల సాగుకు సిద్ధమయ్యారు. ఎలాంటి పెట్టుబడులు, సేద్యపు పరికరాలు, కూలీల అవసరం లేకుండా సొంతంగా ఒక్కరే విత్తు వేసి పంటల సాగులో వినూత్న విధానానికి శ్రీకారం చుట్టారు. కరువు ప్రూఫింగ్ మోడల్ విధానంలో కూలీలతో ఎలాంటి అవసరం లేదు. యంత్ర పరికరాలతో పని ఉండదు. చిన్నపాటి గడ్డపారతోనే భూమిని గుల్లగా చేసుకుని ఎలాంటి పెట్టుబడి లేకుండా విత్తనాలను నాటుకోవచ్చు. దీంతో కూలీల ఖర్చుతో పాటు పెట్టుబడులూ కలసి వస్తున్నాయి.

ఒక అడుగు విస్తీర్ణంలో ఆరు రకాల పంటలు

కేవలం ఒక అడుగు విస్తీర్ణంలో ఏర్పాటు చేసుకున్న గుండ్రటి స్థలంలో ఆముదం, అనుములు, అలసంద, కంది, గోరుచిక్కుడు, సజ్జలు ఇలా ఆరు రకాల పంటలను సాగు చేసుకోవచ్చు. మొత్తం ఒక సెంటు విస్తీర్ణంలో 4 కిలోల విత్తనాలను నాటుకోవచ్చు. అనంతరం పంట ఎదుగుదలను బట్టి 15 రోజులకోసారి ద్రవజీవామృతంను పిచికారీ చేస్తుంటే పంట కాలానికి దిగుబడులు చేతికి అందుతాయి.

కరువు ప్రూఫింగ్ మోడల్ అంటే..

- బీడు భూముల్లో తొలుత 3 X 3 కొలతల్లో ఒక అడుగు భూమిని వృత్తాకారంలో గుర్తించాలి.
- ఎకరా విస్తీర్ణానికి సుమారు 506 గుండ్రటి స్థలాలను ఏర్పాటు చేసి, ఎలాంటి గడ్డి (కలప) లేకుండా వేరు వ్యవస్థ పూర్తిగా తొలగించి ఆ స్థలాన్ని మెత్తగా గుల్ల చేయాలి.
- ముందుగా తయారు చేసుకున్న ఘన జీవామృతాన్ని గుంతల్లోని మట్టితో కలపాలి.
- జీవామృతం, బంకమట్టి పొడితో విత్తన శుద్ధి చేసి తయారు చేసుకున్న ఆరు రకాల పంట సీడ్ బాళ్లను నాటాలి.
- పంట ఎదుగుదలను బట్టి సర్కిళ్లకు మధ్యలో అదనంగా 2 లేదా 3 అడుగుల మధ్యలో వంగ విత్తనాలు, 6 అడుగుల మధ్యలో మునగ విత్తనాలను సైతం నాటుకోవచ్చు.
- ముందుగా ఏర్పాటు చేసుకున్న ద్రవ జీవామృతం కషాయాన్ని ఒక వాటర్ బాటిల్‌లో సిద్ధం చేసుకుని అవసరమైనప్పుడు పిచికారీ చేస్తూ పోవాలి.


భాగ్యమ్మ మెట్ట పొలంలో మొలకెత్తిన సీడ్ బాల్

కరువు ప్రూఫింగ్ మోడల్ కింద ఎంపిక చేసిన ఈ పొలం కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లికి చెందిన పి.భాగ్యమ్మది. కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో భర్త రామచంద్ర మృతి చెందాడు. 8 ఏళ్లుగా తనకున్న 3.50 ఎకరాల పొలాన్ని బీడుగా వదిలేసింది. తాజాగా జెడ్బీఎన్ఎఫ్ సహకారంతో 1.50 ఎకరా విస్తీర్ణంలో కరువు ప్రూఫింగ్ మోడల్ పద్ధతిలో ఆరు రకాల విత్తనాలను నాటింది. ఇందుకు గాను రూ.1,200 వరకు ఖర్చు పెట్టింది. ఘన, ద్రవ జీవామృతం, సీడ్ బాల్‌ను సొంతంగా తయారు చేసుకుంది. ప్రస్తుతం గోరు చిక్కుడు కాయ దశలో ఉండగా, అనుములు, అలసంద పూతదశలో ఉన్నాయి.


ప్రమీలమ్మ పొలంలో మొలకెత్తిన ఐదు రకాల విత్తనాలు

మొక్కల మధ్య గడ్డిని తొలగిస్తున్న ఈమె పేరు బోయ ప్రమీలమ్మ. కళ్యాణదుర్గం మండలం దురదకుంట గ్రామం. ఒంటరి మహిళ. తనకున్న 5 ఎకరాలను 10 ఏళ్లుగా బీడుగా వదిలేసింది. నెల క్రితం జెడ్బీఎన్ఎఫ్ సహకారంతో రెండు ఎకరాల పొలంలో ఆరు రకాల సీడ్ బాళ్లను నాటింది. ప్రస్తుతం అన్నీ మొక్క దశలో ఉన్నాయి. ఈ తరహా వ్యవసాయం ఎక్కడా చూడలేదని, విత్తనాలకు మినహా మిగిలిన వ్యవసాయ పనులకు ఎలాంటి ఖర్చు లేదంటూ ఆమె హర్షం వ్యక్తం చేస్తోంది.

కర్ణాటక మద్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న మద్యం ప్యాకెట్లు చూపుతున్న సెబ్ పోలీసులు

అనంతపురం క్రైం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలను సెబ్ సీఐ రవిచంద్ర వెల్లడించారు. కుందుర్పి మండలం ఎనుములదొడ్డికి చెందిన కె. శివకుమార్, అనంతపురంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన బి.లింగాలు కర్ణాటక ప్రాంతం నుంచి మద్యాన్ని అక్రమంగా తెప్పించుకుని అధిక ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకునేవారు. వీరి చర్యలపై నిఘా ఉంచిన సెబ్ పోలీసులు ముందస్తు సమాచారంతో మంగళవారం ఉదయం అనంతపురంలోని తపోవనం కూడలిలో వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారును ఆపి తనిఖీ చేయగా నాలుగు బాక్సుల్లో తరలిస్తున్న కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు బయటపడ్డాయి. దీంతో వాహనాన్ని సీజ్ చేసి, టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేశారు.

20,422 క్వింటాళ్ల విత్తనం పంపిణీ

అనంతపురం అగ్రికల్చర్: జిల్లాలోని 21 మండలాల పరిధిలో ఆర్బీకే వేదికగా 40 శాతం రాయితీతో 10/17/2023 5:39:56 ్కఖిత్తన పప్పుశెనగ పంపిణీ ప్రక్రియ కొనసాగుతోందని వ్యవసాయశాఖ వర్గాలు తెలిపాయి. ఈ రబీ సీజన్‌కు గాను జిల్లాకు మొత్తం 27,266 క్వింటాళ్లు కేటాయించగా... ఆర్బీకే వేదికగా 24,200 క్వింటాళ్ల కోసం 17,030 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మంగళవారం నాటికి 20,422 క్వింటాళ్ల విత్తన పంపిణీ పూర్తయింది. ఏపీ సీడ్స్ ద్వారా 178 ఆర్బీకేల్లో 24,294 క్వింటాళ్లు నిల్వ చేశారు. ఒక్కో రైతుకు గరిష్ఠంగా 200 కిలోలు పంపిణీ చేస్తున్నారు.

రేపటి నుంచి తురకపల్లి రైల్వే గేటు మూత

అనంతపురం సిటీ: పామిడి రైల్వే స్టేషన్ నుంచి తురకపల్లి మార్గంలో ఎల్‌సీ గేట్ (250/20-22)ను గురువారం నుంచి మూడ్రోజుల పాటు మూసివేయనున్నారు. ఈ మేరకు అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్ మంగళవారం తెలిపారు. పెద్ద వడుగూరు మండలం మిడుతూరు - పామిడి మండలం అయ్యవారిపల్లి మధ్య రోడ్డు మార్గంపై మిడుతూరు వద్ద ఉన్న లెవల్ క్రాసింగ్ పోర్షన్ వద్ద ట్రాక్ మరమ్మతు చేపట్టనున్న నేపథ్యంలో గేట్ మీదుగా రాకపోకలు నిలిపి వేస్తున్నట్లు వివరించారు. ఈ దారిలో సంచరించే వాహన చోదకులు ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలు సాగించాలని సూచించారు.

ఎస్ఎస్‌బీఎన్ అధ్యాపకుడికి జాతీయ సాహితీ పురస్కారం


కవితాగానం చేస్తున్న ఓబిరెడ్డి

అనంతపురం : పద్మశ్రీ బోయి భీమన్న జాతీయ సాహితీ పురస్కారాన్ని జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల అధ్యాపకుడు డాక్టర్ నల్లారెడ్డిగారి ఓబిరెడ్డి అందుకున్నారు. ఉషోదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా బాకరాపేటలో జరిగిన జాతీయ కవి సమ్మేళనంలో ఓబిరెడ్డి చేసిన కవితాగానం అందరినీ ఆకట్టుకుంది. నిర్వాహకులు ఉషారాణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో తిరుపతి షీ టీం ఎస్ఐ సుమతి, మెడికో అబ్రాడ్ సీఈఓ డాక్టర్ రఘురామ్, డాక్టర్ వేణుగోపాలరెడ్డి తదితరులు ఆయనకు అవార్డు నందించారు. కార్యక్రమంలో నన్నయ విశ్వవిద్యాలయం ఆచార్యులు సత్యనారాయణ, ప్రొఫెసర్ బుజ్జి, మార్జియాన, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన కవులు, కళాకారులు పాల్గొన్నారు.

టీటీలో రాణించిన శ్రీశాన్వి


విజేత ట్రోఫీని అందుకుంటున్న శ్రీశాన్వి (ఫైల్)

అనంతపురం: అనంత క్రీడాగ్రామం వేదికగా ఇటీవల జరిగిన రాష్ట్ర స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల్లో అనంతపురం నగరానికి చెందిన శ్రీశాన్వి అద్భుతంగా రాణించింది. అండర్ -13, అండర్ -15 విభాగంలో ప్రథమ స్థాయిలో నిలిచిన ఆమె అండర్-17 విభాగంలో రెండో స్థానాన్ని దక్కించుకుంది. ప్రతిభ చాటుకున్న శ్రీశాన్విని మంగళవారం ఉదయం ఆమె చదువుకుంటున్న హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఉపాధ్యాయులు అభినందించారు.

స్థాయిని మరచి విమర్శిస్తే సహించం

- పబ్లిక్ ప్రాసిక్యూటర్లకు బహిరంగ క్షమాపణ చెప్పాలి
- వందేళ్ల చరిత్రలో ఎస్సీలకు పెద్దపీట వేసింది జగన్ సర్కార్ మాత్రమే
- విలేకరుల సమావేశంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్లు


సమావేశంలో పాల్గొన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

అనంతపురం క్రైం: స్థాయిని మరిచి విమర్శిస్తే సహించబోమంటూ టీడీపీ అనుబంధ న్యాయవాదులను పబ్లిక్ ప్రాసిక్యూటర్లు హెచ్చరించారు. జిల్లా కోర్టు ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా కోర్టు పీపీ హరినాథరెడ్డి, కురబ నాగిరెడ్డి, రాజశేఖర్, ప్రభుత్వ న్యాయవాది గంగాధరరెడ్డి, ఎస్కేయూ సెనేట్ సభ్యుడు ఇలియాజ్ బాషా మాట్లాడారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా టీడీపీ మాజీ మంత్రి పరిటాల సునీత చేపట్టిన దీక్షలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల(పీపీ)పై కొందరు న్యాయవాదులు చేసిన అనుచిత వ్యాఖ్యలను పీపీలు ముక్తకంఠంతో ఖండించారు. పీపీల నియామకంలో ఒకే సామాజిక వర్గానికి పెద్ద పీట వేశారని, మిగిలిన ఇద్దరు చెంచాగాళ్లు ఉన్నారంటూ సీనియర్ న్యాయవాది విజయ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు సిగ్గుచేటన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారిని హీనంగా మాట్లాడడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో 8 మంది పీపీలకు గాను ఒకే సామాజిక వర్గానికి చెందిన ఆరుగురితో పాటు ఇతర సామాజిక వర్గానికి చెందిన ఇద్దరు పనిచేశారని గుర్తు చేశారు. ప్రస్తుతం 12 మంది పీపీలకు గాను ఆరుగురు బీసీ, ఎస్సీ, ఎస్టీలు ఉన్నారన్నారు. ఈ లెక్క పరిశీలిస్తే ఏ ప్రభుత్వ హయాంలో సామాజిక న్యాయం చేకూరిందో ఇట్టే అర్థమవుతుందన్నారు. తక్షణమే అనుచిత వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని, పీపీలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. డిఫెన్స్ కౌన్సిల్‌లో 1 బీసీకి, ఎస్సీకి 1, ఎస్టీకి 1 పోస్టు ఇచ్చారన్నారు. అఫీషియల్ రిసీవర్‌ని కూడా గత ప్రభుత్వంలో ఉన్న వ్యక్తినే కొనసాగిస్తున్నారన్నారు. ఇది రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ నిష్పక్షపాత పాలనకు నిదర్శనమన్నారు. ఇంకా న్యాయవ్యవస్థను బలపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను తెలుసుకుని మాట్లాడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు లక్ష్మీనారాయణరెడ్డి, సుజన, నారపరెడ్డి, గోవిందరాజులు, గొని నాగన్న, ఎల్ నరసింహారెడ్డి, నరేంద్రనాథరెడ్డి పాల్గొన్నారు.

మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు


వివరాలు తెలుసుకుంటున్న జేసీ కేతన్ గార్గ్

బుక్కరాయసముద్రం: రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుందని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ పేర్కొన్నారు. బీకేఎస్ మండలం రోటరీపురంలో జగనన్న పాల వెల్లువ మహిళా డెయిరీ సహకార సంఘాన్ని పరిశీలించారు. మండల వ్యాప్తంగా మహిళా సంఘాలు, గ్రామైక్య సంఘాలపై ఆరా తీశారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధికి అనేక పథకాలు చేపడుతోందని ఈ క్రమంలో ప్రతి మహిళనూ సంఘంలో సభ్యురాలిగా చేర్పించాలని సూచించారు. జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా అమూల్ డెయిరీకి పాలు పోసేందుకు సిద్ధంగా ఉన్న పాడి రైతుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. బల్క్ మిల్క్ కూలింగ్ సెంటర్ నాణ్యతను పరిశీలించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ అండ్ గేజ్ స్టేషన్‌ను పరిశీలించి పని తీరు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సీపీఓ అశోక్‌కుమార్ రెడ్డి, డీసీఓ ప్రభాకర్‌రెడ్డి, పశు సంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఏడీ రత్నకుమార్, తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ తేజోత్స్న పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిపై వేటు

ప్రశాంతి నిలయం/తనకల్లు: ఉపాధ్యాయ వృత్తికే తలవంపులు తీసుకువచ్చేలా ప్రవర్తించి తన వద్ద చదువుకునే విద్యార్థిని గర్భం దాల్చేందుకు కారకుడైన ఉపాధ్యాయుడు రెడ్డి నాగయ్యను విద్యాశాఖ అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ మీనాక్షి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వివరాల్లోకి వెళితే... తనకల్లు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గత విద్యాసంవత్సరం పదో తరగతి పూర్తి చేసిన ఓ బాలిక ప్రస్తుతం ఇంటర్ చదువుతోంది. ఇదే పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పనిచేసే రెడ్డి నాగయ్య బాలికపై గతంలో లైంగిక దాడి చేశాడు. దీంతో గర్భందాల్చిన బాలిక రెండు రోజుల క్రితం కడుపునొప్పితో బాధపడుతూ ఆస్పత్రిలో చేరగా, పురిటి నొప్పులను నిర్ధారించిన వైద్యులు ఆమెకు ప్రసవం చేశారు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తనకల్లు పోలీస్ స్టేషన్‌లో రెడ్డి నాగయ్యపై ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు సోమవారం రెడ్డి నాగయ్యను అరెస్ట్ చేసి పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డీఈఓ మీనాక్షి రెడ్డి నాగయ్యను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

బొలెరో బోల్తా

గాండ్లపెంట: గొర్రెల లోడుతో వెళ్తున్న బొలెరో బోల్తా పడి నలుగురికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని కమతంపల్లి గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మండలంలోని సామాలగొందికి చెందిన లక్ష్మీనారాయణ, కల్లుబావితండాకు చెందిన బద్దేనాయక్, సామచేనుబైలుకు చెందిన తిరుపాలు, ఎన్పీకుంట మండలం మేకలచెరువుకు చెందిన ఆంజనేయులుతో మరో ఇద్దరు మంగళవారం కదిరి వ్యవసాయ మార్కెట్‌కు వెళ్లారు. గొర్రెలను కొనుగోలు చేసి బొలెరో వాహనంలో గాండ్లపెంటకు బయలుదేరారు. మార్గమధ్యలో కమతంపల్లి వద్ద వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో నలుగురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108లో కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలందించారు. ఆంజనేయులుకు తీవ్ర గాయాలు కావడంతో బెంగుళూరు తరలించారు.

ముగిసిన 'అంగన్‌వాడీ' ఇంటర్వ్యూలు

అనంతపురం రూరల్: జిల్లాలోని కళ్యాణదుర్గం, గుంతకల్లు రెవెన్యూ డివిజన్ల పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, మినీ అంగన్‌వాడీ కార్యకర్త, ఆయా పోస్టులకు మంగళవారం నిర్వహించిన ఇంటర్వ్యూలు ముగిశాయి. నాలుగు అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 11 మంది, ఐదు మినీ అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులకు 14 మంది, 38 ఆయా పోస్టులకు 50 మంది అభ్యర్థులు హాజరయ్యారు. కళ్యాణదుర్గం, గుంతకల్లు, ఆర్డీఓల ఆధ్వర్యంలో అభ్యర్థుల విద్యార్హత పత్రాలను పరిశీలించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం


చెక్కు అందుకుంటున్న హోంగార్డు కుటుంబ సభ్యులు

అనంతపురం క్రైం: అనారోగ్యంతో మృతి చెందిన హోంగార్డు డి.మస్తాన్ కుటుంబానికి రూ.4.29 లక్షల చెక్కును ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అందజేశారు. మంగళవారం తన చాంబర్‌కు బాధిత కుటుంబసభ్యులను పిలిపించుకుని ఆయన మాట్లాడారు. కుటుంబ పెద్ద మృతితో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్న కుటుంబాన్ని ఆదుకునేందుకు సహోద్యోగులు చందాలు వేసుకుని సమీకరించిన రూ.4.29 లక్షలను చెక్కు రూపంలో మస్తాన్ భార్య ఖాసీంబీకి అందజేశారు. ఈ సందర్భంగా హోంగార్డుల ఐక్యతను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, ఏఆర్ డీఎస్పీ మునిరాజు, ఆర్ఐ హరికృష్ణ పాల్గొన్నారు.

ఎఫ్ఎల్‌సీని పరిశీలించిన కలెక్టర్

అనంతపురం అర్బన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చేపట్టిన ఈవీఎంలు, వీవీప్యాట్ ఫస్ట్ లెవల్ చెకింగ్ (ఎఫ్ఎల్‌సీ)ను జాగ్రత్తగా నిర్వహించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఎం.గౌతమి ఆదేశించారు. పాత ఆర్డీఓ కార్యాలయ ఆవరణలోని గోదాము వద్ద పటిష్ట బందోబస్తు మధ్య చేపట్టిన ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫొటోలు తీసేందుకు ఎవ్వరినీ అనుమతించబోరాదన్నారు. కెమెరాలను, సెల్‌ఫోన్‌లను లోపలికి అనుమతించినా... నిబంధనలను ఉల్లంఘించినా.. కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్‌సీ ప్రత్యేక అధికారి, ఆర్డీఓ రవీంద్ర పాల్గొన్నారు.

అంబులెన్స్‌లో డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు

అనంతపురం అగ్రికల్చర్: ఉమ్మడి జిల్లా పరిధిలోని డాక్టర్ వైఎస్సార్ పశువైద్య 1962 మొబైల్ వెటర్నరీ అంబులెన్స్‌లలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టుల భర్తీకి చర్యలు తీసుకున్నారు. ఈ మేరకు ఆ విభాగం జిల్లా మేనేజర్ రామకృష్ణగౌడ్, రాయలసీమ ప్రోగ్రాం మేనేజర్ వరప్రసాద్ మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. పదో తరగతి విద్యార్హతతో పాటు హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు అర్హులు. పూర్తి వివరాలకు 96525 33554, 88860 88787లో సంప్రదించవచ్చు.

నీట మునిగి చిన్నారి మృతి


ఉమేష్ చంద్రారెడ్డి (ఫైల్)

గార్లదిన్నె: ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ చిన్నారి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన మేరకు... గార్లదిన్నె మండలం మర్తాడుకు చెందిన శివారెడ్డి, పద్మావతి దంపతుల కుమారుడు ఉమేష్ చంద్రారెడ్డి (9).. పాములరాయి సమీపంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. పాఠశాలకు సెలవులు మంజూరు కావడంతో ఇంటి పట్టునే ఉంటున్న ఉమేష్.. మంగళవారం ఉదయం స్నేహితులతో కసలి హెచ్చెల్సీ వద్దకెళ్లి ఈతకొట్టేందుకు సిద్ధమయ్యాడు. అయితే ఈత రాకపోవడంతో నీట మునిగాడు. తోటి స్నేహితులు వెంటనే గ్రామానికి చేరుకుని జరిగిన విషయాన్ని ఉమేష్ తల్లిదండ్రులకు చేరవేయడంతో ఆగమేఘాలపై వారు అక్కడకు చేరుకుని పరిశీలించారు. అప్పటికే హెచ్చెల్సీలోని నీటిలో విగతజీవిగా తేలాడుతున్న కుమారుడి మృతదేహాన్ని గమనించి వెలికి తీశారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో గుండెలవిసేలా రోదించారు.

యువకుడి దుర్మరణం


చంద్రశేఖర్ (ఫైల్)

పెద్దపప్పూరు: ద్విచక్ర వాహనం అదుపు తప్పి కిందపడిన ఘటనలో ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... యాడికి మండలం తూట్రాళ్లపల్లికి చెందిన చంద్రశేఖర్ (35), కళావతి దంపతులకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం అనంతపురానికి మకాం మార్చిన ఆయన ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌కు వాచ్‌మెన్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పనిపై తాడిపత్రికి బయలుదేరిన ఆయన పెద్దపప్పూరు మండలం ముచ్చుకోట అటవీ ప్రాంతంలో మలుపు వద్ద వేగాన్ని నియంత్రించుకోలేక నేరుగా వెళ్లి డివైడర్‌ను ఢీకొన్నాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి కుటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ శరత్‌చంద్ర తెలిపారు.

'ఐసీఐసీఐ'లో ఉద్యోగాలు.. రేపు వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు

అనంతపురం అగ్రికల్చర్: ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో ఖాళీగా యూనిట్ మేనేజర్లు, ఫైనాన్షియల్ అడ్వయిజర్ ఉద్యోగాల నియామకానికి ఈ నెల 19న వాక్‌ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. ఈ మేరకు జిల్లా ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ ఎ.కళ్యాణి మంగళవారం ఓ ప్రకటన జారీ చేశారు. ఎంప్లాయిమెంట్ కార్యాలయం వేదికగా గురువారం జరిగే ఇంటర్వ్యూలకు ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా హాజరు కావచ్చు. డిగ్రీ విద్యార్హత, 18 నుంచి 33 సంవత్సరాల్లోపు ఉన్న వారు యువతీ యువకులు అర్హులు. సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో ఈ నెల 29న ఉదయం 10.30 గంటలకు ప్రారంభమయ్యే ఇంటర్వ్యూలకు హాజరు కావాలి.

క్లుప్తంగా

కళాకారుడికి ఆర్థిక సహాయం


శ్రీనివాసులుకు చెక్కు అందిస్తున్న కళాకారులు

అనంతపురం కల్చరల్: కళాకారుడు శ్రీనివాసులుకు నగరానికి చెందిన పద్మశ్రీ ఘంటసాల సంగీత కళాభారతి ప్రతినిధులు ఆర్థికసాయం అందించారు. మంగళవారం సామాజిక సేవా కార్యకర్త రవికాంత్ రమణ చేతుల మీదుగా రూ.50 వేలు నగదు, 60 కేజీల బియ్యం బస్తా అందించారు. నిర్వాహకుడు సురేష్ బాబు, సంస్థ ఉపాధ్యక్షుడు సూర్యనారాయణరెడ్డి, డాక్టర్ విజయరామయ్య, ఆదినారాయణ, మారుతీప్రసాద్, శ్రీనివాసులు, కేశవ పాల్గొన్నారు.

వృథాగా ఐసీయూ పడకలు


క్యాజువాలిటీలో వృథాగా ఐసీయూ పడకలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని క్యాజువాలిటీలో ఐసీయూ పడకలు వృథాగా ఉన్నాయి. రోగులకు కాకుండా వైద్యులు, ఇతర ముఖ్యులను మాత్రమే వాటిని వినియోగించాలని రెసిడెన్షియల్ మెడికల్ ఆఫీసర్లు చెబుతుండడం విమర్శలకు తావిస్తోంది. గత నెల 27న క్యాజువాటీలో రోగుల సౌకర్యార్థం రెండు ఐసీయూ పడకలను ఏర్పాటు చేశారు. అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్‌లో పడకల కొరతతో కష్టతరమైన కేసులను క్యాజువాలిటీలో ఉంచి, స్పెషలిస్టు వైద్యులతో సేవలందించనున్నట్లు అధికారులు తెలిపారు. అందుకోసం రెండు వెంటిలేటర్లు, ఐసీయూ పడకలు, పల్స్ ఆక్సీమీటర్లు, ఆక్సిజన్,తదితర వాటిని ఏర్పాటు చేశారు. కానీ అది మూన్నాళ్ల ముచ్చటే అయ్యింది.

మాస్టర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలి

అనంతపురం ఎడ్యుకేషన్: నగర శివారులోని మాస్టర్ జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని ఎస్ఎఫ్ఐ, బీసీ విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్, బీసీ విద్యార్థి సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు సురేష్ మాట్లాడుతూ బైపీసీ విద్యార్థిని లెక్చరర్ సురేష్ రెండు రోజుల కిందట చితక బాదాడని, చెప్పుకాలుతో తన్ని, బెత్తంతో చితకబాదాడన్నారు. విద్యార్థిపై అధ్యాపకుడు ఇలా దురుసుగా ప్రవర్తించడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు, నగర కార్యదర్శి శివ, నగర అధ్యక్షులు బీమేష్, బీసీ విద్యార్థి సంఘం నాయకులు హేమంత్ పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థల ఔదార్యం


నగదు అందిస్తున్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు

అనంతపురం కల్చరల్: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కుడి చేయి కోల్పోయిన నవీన్ అనే వ్యక్తిని స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు మానవత్వంతో ఆదుకున్నారు. ఆదరణ సేవా సమాజ్, సహృదయ సేవా సమితి, ఫ్రెండ్స్ సొసైటీ, బెస్ట్ ఫ్రెండ్స్ సేవా సమితి, శ్రీ మహాలక్ష్మి సేవా ట్రస్టు, అనంత రెడ్ డ్రాప్స్ ప్రతినిధులు నవీన్ కుటుంబ సభ్యులకు రూ. లక్ష ఆర్థికసాయం అందించారు. అదే ప్రమాదంలో గాయపడిన సుమన్ కుటుంబానికి రూ.30 వేలు అందించారు. భవిష్యత్తులో వారి మందులకయ్యే ఖర్చు కూడా భరిస్తామని స్వచ్ఛం సంస్థల ప్రతినిధులు లాల్‌బాషా, బాలకృష్ణ, చంద్రశేఖర్, సర్దార్ వలి, సుజాత, ఆనంద్, అమర్, శబరీష్, సురేష్ తదితరులు భరోసా ఇచ్చారు.

ప్రీఆర్డీ క్యాంపునకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు


విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

అనంతపురం ఎడ్యుకేషన్: విజయవాడ కేఎల్ యూనివర్సిటీలో నవంబరు 1 నుంచి 10 వరకు జరగనున్న 'ప్రీ ఆర్డీ' క్యాంపునకు ఆర్ట్స్ కళాశాల విద్యార్థినులు అఫ్రోజ్ బాబాను, రేఖ ఎంపికయ్యారు. ప్రీఆర్డీ క్యాంపులో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచే విద్యార్థులకు ఢిల్లీలో రిపబ్లిక్ పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందని ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు విష్ణుప్రియ, సోమశేఖర్ విద్యార్థినులను అభినందించారు.

తప్పిన ప్రమాదం

పామిడి: పొగరూరు వద్ద కారు రోడ్డు డివైడర్‌ను ఢీకొన్న ఘటనలో ప్రమాదం తప్పింది. మంగళవారం ఉదయం అనంతపురం నుంచి గుత్తి వైపు వెళ్తున్న కారు వేగాన్ని నియంత్రించుకోలేక పొగరూరు వద్ద వంతెన ప్రహరీని ఢీకొంది. కారులో ఉన్న వారు క్షేమంగా బయటపడ్డారు.

కల్పవల్లీ.. చల్లంగా చూడు తల్లీ!



అలంకరణలో ఐదోరోడ్డు అన్నపూర్ణేశ్వరి, ఆత్మకూరులో వాసవీమాత


చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞాన పీఠం ఆధ్వర్యంలో ఊరేగింపు


అనంతపురం కల్చరల్: నగరంలో దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు నయనమనోహరంగా సాగుతున్నాయి. మంగళవారం రెండో రోడ్డులోని చంద్రశేఖరేంద్ర సరస్వతీ జ్ఞానపీఠం ఆధ్వర్యంలో చండీ, మహావిష్ణు హోమాలు, నగరోత్సవం జరిగింది. పాతూరు, కొత్తూరు వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో, సుభాష్‌రోడ్డు అర్బన్ బ్యాంకు వద్ద అన్నపూర్ణేశ్వరిగా, బాలయోగి ఆశ్రమంలో గజలక్ష్మిగా, శంకరమఠంలో శారదాదేవి మయూర వాహనంపై కౌమారీ అలంకరణలో, హెచ్చెల్సీ కాలనీలో గాయత్రీదేవిగా దర్శనమిచ్చారు. మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో శారదామాత మయూర వాహనంపై విహరించారు. ఎర్రనేల కొట్టాలలో శ్రీనడిమిదొడ్డి నల్లమ్మ ఆలయ 8వ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు చేశారు. జిల్లా రిజిస్ట్రార్ భార్గవ్ అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్తూరు అమ్మవారి శాలలో అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరు సాంబశివారెడ్డిని ఆలయ అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు సన్మానించారు.


పాతూరు చౌడేశ్వరీదేవి ఆలయంలో అన్నపూర్ణదేవి


వెంకటేశ్వరస్వామి ఆలయంలో సింహవాహనంపై అమ్మవారు


రేణుకాయల్లమ్మ ఆలయంలో వేపాకు అలంకరణ


జొన్నలగడ్డ పద్మావతి, ఆలూరు సాంబశివారెడ్డిని సన్మానిస్తున్న కొత్తూరు అమ్మవారిశాల ఆలయ కమిటీ నిర్వాహకులు


పాతూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణేశ్వరి అలంకరణ


సున్నపుగేరిలో రేణుకాయల్లమ్మ ఆలయంలో అమ్మవారు


మున్సిపల్ కాంప్లెక్స్‌లో అన్నపూర్ణదేవి అలంకరణ


రాప్తాడులో అన్నపూర్ణదేవి అలంకరణలో పార్వతిదేవి


కొత్తూరు అమ్మవారిశాలలో అన్నపూర్ణేశ్వరి, పరమేశ్వర అలంకరణ


అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు వచ్చిన భక్తులు


భక్తులతో కిటకిటలాడుతున్న కొత్తూరు అమ్మవారిశాల


పాతూరులో నృత్య ప్రదర్శన చేస్తున్న చిన్నారులు

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రులు

• ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి

అనంతపురం మెడికల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వ ఆస్పత్రులను బలోపేతం చేశారని, తద్వారా పేద, సామాన్య మధ్య తరగతి ప్రజలకు ఖరీదైన వైద్యం అందుతోందని ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని కోర్టు రోడ్డు వైఎస్సార్ పట్టణ ఆరోగ్య కేంద్రం, అశోక్ నగర్‌లోని నగరపాలక సంస్థ పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ఎమ్మెల్యే పరిశీలించారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న రోగులను జిల్లా ఆస్పత్రి, నెట్ వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేయాలని వైద్యులకు సూచించారు. వైఎస్సార్ పట్టణ ఆరోగ్యం కేంద్రాల్లో అందుతున్న సదుపాయాలను ప్రజలు సద్వినియోగం చేసుకునేలా ఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజల్లో చైతన్యం తీసుకురావాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం అవినీతికి పెద్దపీట వేస్తే, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నాడు–నేడు కార్యక్రమం ద్వారా ప్రభుత్వ స్కూళ్లు, ఆస్పత్రులను కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దారన్నారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, కార్పొరేటర్లు ముంతాజ్ బేగం, బీ జయమ్మ, వెంకటరమణ, సైఫుల్లాబేగ్, రూరల్ సర్పంచ్ ఉదయ్, ఉప సర్పంచ్ సుమిత్ర, ఎంపీటీసీ ఆశాజ్యోతి, నాయకులు జావెద్ తదితరులు ఉన్నారు.

పేదల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం ధ్యేయం

రాప్తాడు: పేదల సంపూర్ణ ఆరోగ్యమే సీఎం ధ్యేయమని వైద్యాధికారి శ్రావణి అన్నారు. మంగళవారం మండలంలోని ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయనగర్‌లో స్థానిక గ్రామ సచివాలయం దగ్గర జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ జూటూరు శేఖర్, యూత్ మండల కన్వీనర్ చిత్రెడ్డి సత్యనారాయణ రెడ్డి ప్రారంభిచారు. ఐసీడీఎస్ పౌష్టికాహార స్టాళ్లను సందర్శించారు. 429 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 52 మందిని శస్త్ర చికిత్సల కోసం అనంతపురానికి రెఫర్ చేసినట్లు వైద్యాధికారి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, ఈఓఆర్డీ నరసింహారెడ్డి, సర్పంచు శశికళ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ హేమలత, వైఎస్సార్ సీపీ నాయకులు వెన్నపూస లోకేశ్వర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు పెద్ద శ్రీనివాసులు, చిత్రా మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.


ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే అనంత


రాప్తాడు మండలం చిన్మయనగర్‌లో సురక్ష కిట్లు పంపిణీ చేస్తున్న అధికారులు


ఆత్మకూరులో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యసిబ్బంది

ప్రజల చెంతకే మెరుగైన వైద్యం

ఆత్మకూరు: గ్రామాల్లో ప్రజలు ఎలాంటి ఆరోగ్య ఇబ్బందులు పడకుండా ప్రజల చెంతకే వైద్య సేవలు వచ్చేలా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేశారని మండల వైద్యాధికారి దయాకర్, ఎంపీడీఓ రఘునాథ్ తెలిపారు. మంగళవారం ఆత్మకూరులోని శ్రీ కనకదాస కల్యాణ మంటపంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఆత్మకూరు నుంచే కాకుండా కుర్లపల్లి, కొత్తపల్లి గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నారు. మొత్తం 592 మందికి వైద్య పరీక్షలు చేశారు. వారిలో 32 మందిని రెఫర్ చేసినట్లు డాక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ హేమలత, సర్పంచ్ వరలక్ష్మి, వైస్ ఎంపీపీ విజయ్, నీలిమ, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి చంద్రశేఖర్‌రెడ్డి, కన్వీనర్ లక్ష్మీనరసింహులు, యూత్ కన్వీనర్ కొండారెడ్డి, ఉప సర్పంచ్ తైదుల శివారెడ్డి, మాజీ జెడ్పీటీసీ బంధూక మధు, జిల్లా కార్యదర్శి వెంకట్రాముడు, నాయకులు ఆవుల ఈశ్వరరెడ్డి, గోపాల్‌రెడ్డి, అతిక్‌రెడ్డి, కేశవరెడ్డి, వన్నూరప్ప, ఎంపీహెచ్ఓ శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు మరూరులో..

రాప్తాడు: మండలంలోని మరూరు గ్రామంలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాల్మన్, వైద్యాధికారి శివ కృష్ణ, తహసీల్దార్ లక్ష్మీనరసింహ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

రాప్తాడురూరల్: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ మహిళ చికిత్సకు రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి అండగా నిలిచారు. రూ. 20 వేల ఆర్థిక సాయం ప్రకటించారు. అనంతపురం రూరల్ మండలం పాపంపేటకు చెందిన రాజేశ్వరి దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతోంది. ఈమెకు భర్త లేడు. ఉన్న ఒక్క కూతురు మానసిక వికలాంగురాలు. ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఇటీవల పాపంపేటలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమం చేపట్టారు. స్థానిక నేతలు రాజేశ్వరి దీనస్థితిని ఎమ్మెల్యేకు వివరించారు. మంగళవారం జేసీఎస్ మండల కన్వీనర్ మఠం శ్యాంసుందర్, గ్రామ కన్వీనర్ మాదన్న యాదవ్, సచివాలయ కన్వీనర్లు కుమ్మెత గోపాల్‌రెడ్డి, ఈశ్వరయ్య, శివ శంకర్, భాస్కర్ రెడ్డి బాధితురాలికి అందజేశారు.

పనులు వేగవంతం చేయండి


అధికారులతో మాట్లాడుతున్న జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం రూరల్: వికలాంగుల శిక్షణ కేంద్ర ప్రహరీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని జేసీ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం వికలాంగుల శిక్షణ కేంద్రం ప్రహరీని జేసీ పరిశీలించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ శాఖ ఏడీ అబ్దుల్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'ఆరోగ్య సురక్ష' క్యాంపులు

అనంతపురం కార్పొరేషన్: పాతూరులోని కస్తూరిబా బాలికల ఉన్నత పాఠశాల, అరవిందనగర్‌లోని శ్రీ కృష్ణదేవరాయ ఉన్నత పాఠశాలలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు కమిషనర్ భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయం ఓ ప్రకటన విడుదల చేసింది. 17, 29వ సచివాలయ పరిధిలోని బ్రాహ్మణ వీధి, నీరుగంటి వీధి, అరవిందనగర్, మిస్సమ్మ కాలనీ ప్రాంత ప్రజలు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

రాప్తాడు: గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా సంఘాల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పంగల్ రోడ్డులో ఉన్న టీటీడీసీ కేంద్రంలో డీఆర్‌డీఏ–వైకేపీ ప్రశాంతి జిల్లా సమాఖ్య 19వ వార్షిక మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి మహిళనూ సంఘాల్లోకి చేర్పించాలన్నారు. సంఘాల ద్వారా రుణాలు తీసుకున్న మహిళలు సకాలంలో చెల్లించి, సంఘాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. అనంతరం ఆరోగ్యం, విద్య, వ్యవసాయం, సామాజిక భద్రత, ఆస్తుల సృష్టి, సుస్థిర జీవనోపాధులు, అనిమియా, బాల్య వివాహాల నిర్మూళనపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏపీడీ ఈశ్వరయ్య, పీఎంఎల్ రాధారాణి, డీపీఎం చేయూత ఎంకే సత్యనారాయణ, డీపీఎం ఫైనాన్స్ ఎం. సత్యనారాయణ, డీపీఎం బ్యాంకు లింకేజ్ రవీంద్రబాబు, స్త్రీ నిధి ఏపీఎం శ్రీనివాసులు, తాడిపత్రి ఏసీ రాజ్యలక్ష్మి, ఏపీఎం అనిత దేవి, ఎఫ్‌పీఓ ఏపీఎం రియాజ్ బేగ్, ఉన్నతి ఏపీఎం మంజుల, ఎంఎస్ ఓబి, ఏపీడీ, డీపీఎంయూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ నరసింహారెడ్డి

రసం పీల్చే పురుగు నివారణకు చర్యలు చేపట్టండి

పెద్దవడుగూరు : కొర్ర, పత్తి రైతులు రసం పీల్చే పురుగు, గులాబీరంగు పురుగు నివారణ చర్యలు చేపట్టాలని కృషి విజ్ఞాన కేంద్రం పరిశోధన సంస్థ ప్రధాన శాస్త్రవేత్త శశికళ, కిశోర్‌కుమార్‌రెడ్డి, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సూచించారు. మంగళవారం ఆవులాంపల్లిలో వారు పత్తి, కొర్ర, జొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గులాబీరంగు పురుగు, రసం పీల్చే పురుగు నివారణ కు అసిఫేట్ 75 ఎస్పీ 1.5 గ్రాములు లీటర్ నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.

సింహ వాహనంపై శ్రీనివాసుడు


సింహ వాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

అనంతపురం కల్చరల్: శ్రీవారి బ్రహ్మోత్సవ సంబరాలు భక్తుల్లో ఆనందోత్సాహాలను నింపుతున్నాయి. మంగళవారం రాత్రి స్థానిక ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం లక్ష్మీనారాయణ హోమం, దీక్షా హోమం వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. సాయంత్రం కళాకారుల కోలాట నృత్యాల నడుమ శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై సింహ వాహనంపై నగరవీధుల్లో విహరించి పూజలందుకున్నాడు. రామనగర్, హౌసింగ్ బోర్డు, శ్రీనివాసనగర్ తదితర చోట్ల బ్రహ్మోత్సవ వేడుకలు కమనీయంగా సాగాయి.

పోలీసు జట్టుకు అభినందన


జట్టు సభ్యులను అభినందిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: ఆర్టీటీ స్టేడియంలో ఏపీ స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మ్యాచ్‌లో విజేతగా నిలిచిన పోలీసు జట్టును ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ అభినందించారు. విజేత జట్టుతో పాటు గెలుపునకు కీలకంగా వ్యవహరించిన ఎస్ఐ జయపాల్ రెడ్డి, ఆర్ఎస్ఐ బాలాజీ నాయక్‌ను ప్రశంసించారు.

ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ పాలకవర్గం ప్లాస్టిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటోంది. గతంలో నగరపాలక సంస్థ అధికారులు దాడులు చేసి, టన్నుల కొద్దీ ప్లాస్టిక్‌ను సీజ్ చేశారు. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారులు, ప్రజలు పాలకవర్గం దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం నగరపాలక సంస్థలో కమిషనర్ భాగ్యలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, హైదరాబాద్‌కు చెందిన ఎకో లాస్టిక్ కంపెనీ సీఈఓ రజనీకాంత్, డైరెక్టర్ శ్రీనివాస్, తదితరులు సమావేశమయ్యారు. పర్యావరణానికి ముప్పులేని ప్లాస్టిక్‌ను అందుబాటులోకి తెస్తే ప్రయోజనకరమని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. నగరపాలక సంస్థ కార్యదర్శి సంగం శ్రీనివాసులు పాల్గొన్నారు.


పడిపోయిన చెట్టు

మోడుబారినా మొలుస్తూనే ఉంటా..

మనిషి.. చెట్టుది ఉచ్ఛ్వాస, నిశ్వాసల బంధం. ఒంట్లో శక్తి ఉంటే చివరి 'శ్వాస' వరకూ కష్టపడి పనిచేస్తా ..ఇదీ మనిషి తనలో విశ్వాత్మవిశ్వాసం సన్నగిల్లకుండా చెప్పే మాట. చేవ ఉంటే చాలు ..మోడుగా మారినా చిగురిస్తా అని చెప్పకనే చెప్తుంది చెట్టు. అనంతపురం నగరంలోని పశువైద్యశాల ఆవరణలో ఉన్న పెద్ద చెట్టు కొమ్మ గాలిజిభత్సానికి విరిగిపడింది. కొమ్మలు ఎండిపోయి మోడుబారినా.. ఆ మొద్దు కూడా మొలుస్తోంది. చేవ ఉన్నంత వరకూ ఇలా చిగురిస్తుంటానని సందేశాన్ని ఇస్తోంది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

సాక్షి ఫ్యామిలీ
IV
అనంతపురం
బుధవారం ॥ 18-10-2023

ప్రతిభ

మన చుట్టూ మనకు తెలియకుండానే
ఎంతో మంది రకరకాల బాధలకు లోనవుతుంటారు.
వారిలో ముఖ్యంగా వృద్ధులు, వికలాంగుల
సమస్యలకు సరైన పరిష్కారం తెలియక
ఇబ్బందులు పడుతుంటారు.
వారి మానాన వారిని అలాగే వదిలేయడం కన్నా
పరిష్కారాన్ని కనుగొంటాను అనుకున్నాడు.
తనదైన మార్గంలో ప్రయత్నించాడు.
విజయం సాధించాడు.
సత్కారాలను పొందుతున్నాడు
హైదరాబాద్ వాసి హేమేష్ చదలవాడ.


తల్లి సంధ్యతో హేమేష్ చదలవాడ

అమ్మమ్మలకు అండగా!

దేశవ్యాప్తంగా వివిధ రంగాలలో సేవలు అందించిన 21 ఏళ్ల లోపు 20 మంది యువ సాధకులను ఢిల్లీలో మొన్న జరిగిన 'అన్‌స్టాపబుల్ 21' వేదికగా సత్కరించారు. హ్యూమన్ స్టడీస్, సైన్స్, క్రీడలు, ఫైన్ ఆర్ట్స్, పెర్ఫార్మింగ్ ఆర్ట్, సోషల్ ఇంపాక్ట్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనే ఏడు రంగాలలో ప్రతిభావంతులైన యువతకు ఈ సత్కారాన్ని అందజేశారు. వారిలో హైదరాబాద్‌కు చెందిన 16 ఏళ్ల హేమేష్ చదలవాడ ఎలక్ట్రానిక్స్ రంగంలో కనబరిచిన ప్రతిభకు గుర్తింపు పొందాడు.


హేమేష్ తయారుచేసిన డివైజ్

మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతో మందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను.
– హేమేష్

వృద్ధులకు సహాయం..

హేమేష్ పన్నెండేళ్ల వయసు నుంచి ఎలక్ట్రానిక్స్, రోబోటిక్స్ రంగంలో గణనీయమైన ప్రతిభను చూపుతున్నాడు. అల్జైమర్స్ వ్యాధితో బాధపడుతున్న అమ్మమ్మను చూసి ఆమెకు ఏదైనా సాయం చేయాలనుకున్నాడు. తన ఆలోచనల గురించి హేమేష్ చెబుతూ 'నడిచేటప్పుడు అమ్మమ్మ అడుగులు తడబడుతుండేవి. మతిమరపు ఉండేది. ఆమెకు తన మీద తనకు కంట్రోల్ ఉండేది కాదు. కొన్నిసార్లు అర్ధరాత్రి మంచంపై నుంచి లేచి ఎటో వెళ్లిపోయేది. దీంతో ఆమెను కనిపెట్టి ఉండటం కష్టమయ్యేది. అమ్మమ్మకు, ఆమెను చూసుకునే మాకూ ఇదో సవాల్‌గా ఉండేది. కొన్ని అందుబాటులో ఉన్న డివైజ్‌లను ప్రయత్నించి చూశాం. కానీ, ఏ మాత్రం సంతృప్తిగా అనిపించలేదు. అమ్మమ్మకు సాయపడే డివైజ్‌ను నేనే సొంతంగా తయారుచేయాలనుకున్నాను' అని తనలో రూపుదిద్దుకున్న ఆలోచనను వివరిస్తాడు. హేమేష్ కృషి, పట్టుదల, అంకితభావానికి అతని తల్లిదండ్రులు కిశోర్, సంధ్యలు ప్రోత్సాహం అందించారు.

పరికరం ఎలా పనిచేస్తుందంటే..

ఈ పరికరం వాచ్‌లాగా మణికట్టుకూ కట్టుకోవచ్చు. బ్యాడ్జ్‌గానూ ధరించవచ్చు. రోగి నడక, భంగిమ, శరీర ఉష్ణోగ్రత, నాడిని పర్యవేక్షిస్తుంది. నీళ్ల జారిపడుతుండే శబ్దాన్ని కూడా గుర్తించగలదు. మనిషి దూరంగా తిరుగుతున్నప్పుడు లేదా పడిపోవడం వంటి ప్రమాదంలో ఉన్నప్పుడు వెంటనే తెలియజేస్తుంది. ఇంకా అలారంలో 'పిల్‌బాక్స్' ఫీచర్ కూడా ఉంటుంది. ఇది రోగులు వారి మందులు తీసుకునే సమయం వచ్చినప్పుడు హెచ్చరికలను పంపుతుంది. 'ఈ డివైజ్ మా అమ్మమ్మ కోసం తయారుచేసినప్పుడు ఇంటర్నెట్ సరైన మార్గం చూపింది. అయితే, ఈ పరికరం పూర్తయ్యేసరికి అమ్మమ్మ చనిపోయారు' అని బాధపడే హేమేష్ డివైజ్ చేతిలో పట్టుకొని 'మా అమ్మమ్మ వయసున్న వారు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు ఇది సరైన పరిష్కారం సూచిస్తుంది. ఎంతోమందికి సాయం చేస్తుందని ప్రామిస్ చేస్తున్నాను' అని చెబుతున్న హేమేష్ 12వ తరగతి చదువుతున్నాడు. తన తదుపరి ప్రాజెక్ట్స్‌తో ఎలక్ట్రానిక్స్, రోబోటిక్ రంగంలో మరిన్ని అడుగులు వేస్తున్నట్టుగా వివరించాడు.

2021లో ప్రధానమంత్రి చేతుల మీదుగా రాష్ట్రీయ బాల పురస్కారాన్ని అందుకున్నాడు. పేరున్న కంపెనీల నుంచి గ్రాంట్‌లను పొందాడు.


– నిర్మలారెడ్డి

మణిపూర్ ఒక మంచి వార్తను వినిపించింది.
ఆ రాష్ట్రానికి చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్ తీసిన
'ఆంద్రో డ్రీమ్స్' ముంబైలో జరుగుతున్న చలన చిత్రోత్సవంలో
బెస్ట్ డాక్యుమెంటరీగా ఎంపికైంది.
మణిపూర్‌లోని మారుమూల గ్రామం 'ఆంద్రో'లో ఆడపిల్లల
ఫుట్‌బాల్ క్లబ్‌ను 30 ఏళ్లుగా పరిస్థితులకు ఎదురీది నడుపుతున్న
'లైబి' అనే మహిళ పోరాటాన్ని ఈ డాక్యుమెంటరీ రికార్డు చేసింది.
ఆడపిల్లల క్రీడా స్వేచ్ఛను ఎన్ని అడ్డంకులొచ్చినా
కొనసాగనివ్వాలనే సందేశం ఇచ్చే ఈ డాక్యుమెంటరీ
దేశ, విదేశాల్లో ప్రశంసలు పొందుతోంది.

అడ్డంకులను దూరంగా తన్ని...


దర్శకురాలు: మీరా లాంగ్‌జామ్

న్యూస్‌మేకర్


ఆంద్రో డ్రీమ్స్ పోస్టర్

అంతా చేసి ఎనిమిది వేల మంది జనాభా మించని ఊరు ఆంద్రో. మణిపూర్ తూర్పు ఇంఫాల్ జిల్లాలో మారుమూల ఉంటుంది అది. అక్కడి ఆడపిల్లలు ఫుట్‌బాల్ ఆడితే ఏంటి... ఆడకపోతే ఏంటి? కాని 60 ఏళ్ల లైబి మాత్రం– ఆడాల్సిందే అంటోంది. ఆమె గత ముప్పై ఏళ్లుగా 'ఆంద్రో మహిళా మండల్ అసోసియేషన్– ఫుట్‌బాల్ క్లబ్' (అమ్మ– ఎఫ్‌సీ) నడుపుతోంది. ఈ క్లబ్‌కు నిధులు లేవు. బిల్డింగ్ లేదు. ఊళ్లో ప్రోత్సాహం లేదూ, ఏమీ లేదు. కాని లైబి మాత్రం అంతా తానై క్లబ్‌ను నడుపుతోంది. ఈ మధ్యే ఆమె ఒక పూరి పాక నిర్మించి దానినే క్లబ్ బిల్డింగ్‌గా ప్రారంభించుకుంది.

'అమ్మాయిలు కేవలం వంటకు, ఇంటి పనికి అంకితమై పోకూడదు. చదువుకోవాలి. ఆడాలి. ధైర్యంగా భవిష్యత్తును నిర్మించుకోవాలి. మా ప్రాంతంలో పురుషులదే సర్వాధికారం. ఇంటి పెద్ద, తెగ పెద్ద ఎంత చెప్తే అంత. వారి దృష్టిలో ఆడవాళ్ల గురించి చింతించాల్సింది ఏమీ ఉండదు. అమ్మాయిలు ఆడతామన్నా ఒప్పుకోరు. నా పోరాటం వల్లే ఇవాళ మా ఊరి నుంచి జాతీయ స్థాయిలో అమ్మాయిలు ఫుట్‌బాల్ ఆడుతున్నారు' అంటుంది లైబి.



తన ఫుట్‌బాల్ క్లబ్ పూరి పాక ముందు లైబి

ఈమె పోరాటం ప్రపంచానికి చెప్పదగ్గది అనిపించింది మణిపూర్‌కే చెందిన మహిళా దర్శకురాలు మీనా లాంగ్‌జామ్‌కు. అలా తయారైన డాక్యుమెంటరీనే 'ఆంద్రో డ్రీమ్స్'.

ఇద్దరి కథ

ప్రస్తుతం ముంబైలో 'జాగరణ్ ఫిల్మ్ ఫెస్టివల్' అట్టహాసంగా జరుగుతోంది. ఇందులో 'ఆంద్రో డ్రీమ్స్' బెస్ట్ డాక్యుమెంటరీగా నిలిచింది. ఇప్పటికే కేరళ, కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్స్‌కు ఎంపికైన ఈ డాక్యుమెంటరీ ముంబైలో విమర్శకుల్ని విశేషంగా ఆకట్టుకుంది. 'దీనికి కారణం ఆంద్రోలో అమ్మ క్లబ్‌ను నడుపుతున్న లైబి పోరాటాన్ని, ఆ క్లబ్‌లో గొప్ప ఫుట్‌బాల్ ప్లేయర్‌గా ఉంటూ మంచి భవిష్యత్తు నిర్మించుకోవాలనుకునే నిర్మల అనే అమ్మాయి ఆకాంక్షలని నేను చూపించడమే. ఒక రకంగా చాదస్త వ్యవస్థతో రెండు తరాల స్త్రీల పోరాటం ఈ డాక్యుమెంటరీ' అని తెలిపింది మీనా లాంగ్‌జామ్.

మణిపూర్ వెలుతురు

నిజానికి మే 3వ తేదీ నుంచి మణిపూర్ వేరే కారణాల రీత్యా వార్తల్లో ఉంది. కాని మణిపూర్‌ను అభిమానించేవారికి ఇప్పుడు ఈ డాక్యుమెంటరీ సాధిస్తున్న విజయాలు సంతోషాన్ని ఇస్తున్నాయి. 'నా డాక్యుమెంటరీ విజయం మా ప్రాంతంలో గతాన్ని మర్చిపోయి కొత్త జీవితం మొదలుపెట్టే ఉత్సాహాన్ని ఇస్తే అంతే చాలు' అంది మీనా లాంగ్‌జామ్. మణిపూర్ యూనివర్సిటీలో కల్చరల్ స్టడీస్‌లో ప్రొఫెసర్‌గా ఉన్న మీనా పాఠాలు చెప్పడంతో పాటు డాక్యుమెంటరీలు కూడా తీస్తుంది. 2015లో ఆమె మణిపూర్‌లో ఫస్ట్ మహిళా ఆటోడ్రైవర్‌గా ఉన్న లైబీ ఓయినమ్ మీద డాక్యుమెంటరీ తీస్తే దానికి చాలా పేరొచ్చింది. ఆ తర్వాత 'అచొబీ ఇన్ లవ్' పేరుతో పోలో ఆటకు అనువైన స్థానిక జాతి అశ్వాలపై డాక్యుమెంటరీ తీస్తే దానికీ పేరొచ్చింది. ఇప్పుడు 'ఆంద్రో డ్రీమ్స్' మణిపూర్ ఘనతను చాటుతోంది.

బాలికలు, యువతులు క్రీడల్లో ఎంతో రాణిస్తున్నా ఇంకా గ్రామీణ ప్రాంతాల్లో ఆంక్షలు ఉండనే ఉంటాయి. అలాంటి ప్రతి చోట అమ్మాయిలను ప్రోత్సహించే లైబి లాంటి యోధురాళ్లు, వారి గెలుపు గాథలను లోకానికి తెలిపే మీనా లాంటి వాళ్లు ఉండాలని కోరుకుందాం.

యూత్ పల్స్

'ఇప్పటి వరకు ఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూశారు. ఇక డీఇన్‌ఫ్లుయెన్సర్ పవర్ ఏమిటో చూసే టైమ్ వచ్చింది'... ఇది తెలుగు సినిమాలో మాస్ డైలాగ్ కాదు. సోషల్ మీడియాలో ఒక కుర్రాడు పెట్టిన కామెంట్.

సోషల్ మీడియాలో ఇన్‌ఫ్లుయెన్సర్‌ల హవా నడుస్తున్న కాలం ఇది. కస్టమర్‌లు ఏది కొనాలో, ఏ షో చూడాలో, ఎలాంటి ఆరోగ్య సూత్రాలు పాటించాలో చెబుతున్నారు. ఇప్పుడు ఈ ట్రెండ్‌కు అడ్డుపడే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్ యువతరం నుంచే వచ్చి బలపడుతోంది. ట్రెడిషనల్ ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఒక ప్రొడక్ట్‌ను హైప్ చేస్తే డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు ఆ హైప్‌ను ఛాలెంజ్ చేస్తున్నారు....

ఢీ అంటే ఢీ
ఆర్ట్ ఆఫ్ డీఇన్‌ఫ్లుయెన్సింగ్



మార్కెటింగ్ డాటా అండ్ ఎనలిటిక్స్ కంపెనీ కంతార్ స్టడీ రిపోర్ట్ ప్రకారం వినియోగదారులపై ఇన్‌ఫ్లుయెన్సర్‌ల సిఫారసుల ప్రభావం తక్కువేమీ కాదు. సోషల్ మీడియాలో ఎటు చూసినా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కనిపిస్తారు. టీ పొడుల నుంచి టీపాయ్‌ల వరకు రకరకాల ప్రాడక్ట్స్‌ను ప్రమోట్ చేయడానికి చిన్నచిన్న క్యాచీ వీడియోలను రూపొందిస్తారు. దీనికి భిన్నంగా ఒక ప్రాడక్ట్‌ను విశ్లేషిస్తూ విమర్శిస్తే...అదే డీఇన్‌ఫ్లుయెన్సింగ్!

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' హ్యాష్‌ట్యాగ్‌తో టిక్ టాక్‌లో ఈ ట్రెండ్ మొదలైంది.

సోషల్ మీడియా ఎనాలటిక్స్ ఫర్మ్ ట్యూబ్‌లర్ ల్యాబ్స్ చెబుతున్నదాని ప్రకారం గత సంవత్సరం నుంచి ఈ ట్రెండ్ ఊపందుకుంది. మ్యాడి వెల్ అనే ఇన్‌ఫ్లుయెన్సర్ ప్రముఖ కాస్మటిక్ స్టోర్స్‌లో పని చేసింది. కొన్ని ప్రాడక్ట్స్ పట్ల కస్టమర్‌లు ఎందుకు విముఖంగా ఉన్నారో తన స్వీయ అనుభవాలను తెలియజేసింది. ఈ ప్రభావంతో ఆమె పేరు ఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితా నుంచి డీఇన్‌ఫ్లుయెన్సర్‌ల జాబితాలోకి చేరింది.

న్యూయార్క్‌కు చెందిన ఇరవై సంవత్సరాల క్లారా కొన్ని బ్రాండ్‌లను విమర్శిస్తూ వీడియోలు చేసింది. వాటిలో ఒకటి వైరల్‌గా మారింది. అదే సమయంలో తాను విమర్శించిన బ్రాండ్ నుంచి ఎలాంటి స్పందన వస్తుందో అనే భయం పట్టుకుంది. అయితే తనకు తానుగా ధైర్యం తెచ్చుకోవడానికి ఎంతో సమయం పట్టలేదు.

'నేను సరియైన వివరాలతోనే వీడియో చేశాను. నేనెందుకు భయపడాలి' అంటోంది క్లారా.

మన సెలబ్రిటీ ఒకరు ఆరోగ్య సంబంధమైన విషయాలపై కాస్త లోతుగానే మాట్లాడాడు. అయితే ఆయన అవగాహన లోపాన్ని ఒక వైద్యుడు వెంటనే ఎత్తిచూపాడు. పాపులర్ చైనీస్ వ్లోగర్ ఒకరు తన వయసు తక్కువగా కనిపించేలా సాంకేతిక మాయ చేస్తే ఎవరో కుర్రాడు కనిపెట్టి 'ఆయన అసలు రూపం ఇది' అని చూపాడు.



సమస్య ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కాదు. కొందరు ఇన్‌ఫ్లుయెన్సర్‌లు అనుసరిస్తున్న ధోరణి. వారిలో మార్పు రావాలి. సామాజిక బాధ్యత పెరగాలి. యువతలో అశాంతి, ఆందోళన రేకెత్తించే కంటెంట్‌కు దూరంగా ఉండాలి.
– హిమాద్రి పటేల్, డిజిటల్ క్రియేటర్

స్వీడన్ ఇన్‌ఫ్లుయెన్సర్ ఫేక్ ట్రిప్ గురించి మరొక యువకుడు 'ఇవి ఫొటోషాప్ చిత్రాలు' అని నిజాన్ని బహిర్గతం చేశాడు. నిజానికి ఇలాంటివి సోషల్ మీడియాలో గతంలో లేవని కాదు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' పుణ్యామా అని 'అది కాదు ఇది' అని వెంటనే సాధికార సమాచారంతో స్పందించే ధోరణి పెరిగింది.

డీఇన్‌ఫ్లుయెన్సర్‌లు వోవర్–హైప్‌డ్ ప్రాడక్ట్స్‌ను విమర్శించడమే కాదు చౌక ధరల్లో లభించే వాటి గురించి చెబుతున్నారు.

యూనివర్శిటీ ఆఫ్ పెన్సిల్వేనియాలోని వార్టన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో ప్రొఫెసర్ అయిన అమెరికస్ రీడ్ ఇలా అంటున్నారు... 'ఇన్‌ఫ్లుయెన్సర్‌లలో ఎక్కువ మంది సాధికారికంగా మాట్లాడడం లేదేమో అనే భావన కస్టమర్‌లలో వచ్చింది. డబ్బులు ఇస్తారు కాబట్టి సంబంధిత ప్రాడక్ట్‌ను ప్రమోట్ చేస్తారు. నిజానిజాల గురించి వారికి అవసరం లేదు. ఈ నేపథ్యంలో కాస్తో కూస్తో డీఇన్‌ఫ్లుయెన్సరే నయం అనుకుంటున్నారు. నిజానికి డీఇన్‌ఫ్లుయెన్సర్ కూడా ఇన్‌ఫ్లుయెన్సరే'

కొందరు ఒక అడుగు ముందుకు వేసి ఈ ట్రెండ్‌కు 'యాంటీ క్యాపిటలిస్ట్' ట్రెండ్‌గా నామకరణం చేశారు.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ వల్ల వృథా ఖర్చులు తగ్గుతాయని, వేలం వెర్రికి అడ్డుకట్టపడుతుందని, పర్యావరణ కోణంలో కూడా ఈ ట్రెండ్ వల్ల మేలు జరుగుతుందని యువతరంలో ఎంతోమంది బలంగా వాదిస్తున్నారు. తమ అభిప్రాయాలను సామాజిక మాధ్యమాలలలో ఇతరులతో పంచుకుంటున్నారు. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' ట్రెండ్‌పై ప్రశంసలతో పాటు విమర్శలు కూడా ఉన్నాయి.

డీఇన్‌ఫ్లుయెన్సింగ్‌కు విషయ సాధికారత, నిజాయితీ అనేవి కీలకం. అయితే 'డీఇన్‌ఫ్లుయెన్సింగ్' రూపంలో సూడో–అథెంటిసిటీ ముందుకు వస్తుందని, ఈ ట్రెండ్‌ను తమ స్వార్థానికి ఉపయోగించుకునే వారి సంఖ్య పెరుగుతుందనే విమర్శ ఉంది.

'ఈ ట్రెండ్ కాస్త చివరికి ఎలా మారుతుందంటే ఇది కొనవద్దు. మీరు కొనాల్సింది అది అన్నట్లుగా!' అంటుంది 26 సంవత్సరాల అమెరికన్ ఇన్‌ఫ్లుయెన్సర్ జెస్సిక.

'ముఖ్యమైన విషయం ఏమిటంటే ఇన్‌ఫ్లుయెన్సర్‌లు చెప్పగానే కస్టమర్‌ల అభిప్రాయాలు రాత్రికి రాత్రి మారిపోవు. ఇన్‌ఫ్లుయెన్సర్‌లు కేవలం సలహా ఇస్తారు. అంతే. ఏది కొనాలి, ఏది కొనకూడదు అనే స్వీయవిచక్షణ కస్టమర్‌లలో ఉంది. ఇన్‌ఫ్లుయెన్సర్‌లుగా మేము పారదర్శకంగా, నిజాయితీగా ఉంటాం' అంటుంది ఫ్రాన్స్‌కు చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్ కోలిన్. ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 4,00,000 ఫాలోవర్స్ ఉన్నారు.

ప్రస్తుతం డీఇన్‌ఫ్లుయెన్సింగ్ ట్రెండ్ హెల్త్, ఫైనాన్స్, లైఫ్‌స్టైల్ విభాగాలలో ఎక్కువగా కనిపిస్తుంది.

'డీఇన్‌ఫ్లుయెన్సింగ్ అనేది వాపా బలుపా?' అనేది పక్కన పెడితే ఈ ట్రెండ్ మూలంగా ఇన్‌ఫ్లుయెన్సర్‌లు ప్రాఫిట్‌కు మాత్రమే కాదు మెరిట్‌కు కూడా ప్రాధాన్యత ఇచ్చే ధోరణి, జవాబుదారీతనం పెరుగుతుంది.

● ఆటో అన్సారీ

లైఫ్ గేర్ మార్చింది


నజ్మా అన్సారీ

ఓ యువకుడు యాచకుడి వేషంలో, కేజీల మొత్తంలో కరెన్సీ నాణేలను తీసుకుని ఐఫోన్ కొనడానికి వెళ్లిన వార్త ఇటీవల సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. మంచి వయసు, ఓపిక ఉన్న వారే ఇలా చేస్తుంటే... ఓపిక లేకపోయినా సమాజంలో గౌరవంగా బతికేందుకు బురఖా వేసుకుని ఆటో నడుపుతోంది నజ్మా అన్సారీ. అయినా ఇతరుల ముందు చేయి చాచే కంటే.. కష్టపడడమే గౌరవం అనుకుంది. 'గేర్లు మార్చేయండి చాలు గౌరంగా బతకవచ్చు' అని చెబుతూ ఎంతో మందికి ప్రేరణగా నిలుస్తోంది.



నజ్మా అన్సారీ వయసు 45. ఉత్తరప్రదేశ్, మొరాదాబాద్ నగరంలోని కట్‌ఘర్‌లో ఆమె నివసిస్తోంది. ఆమెకు ఇద్దరు పిల్లలు. 2010లో భర్త మరణించడంతో ఇంటి భారం ఆమె మీద పడింది. అప్పటిదాక గృహిణిగా ఉన్న నజ్మాకు తన కొడుకు, కూతుర్ని ఎలా పెంచాలో అర్థం కాలేదు. భర్త నడిపిన టీషాపును అద్దె కట్టలేక వదిలేసింది. ఇంట్లోనే టీ తయారు చేసి విక్రయించింది. అలా పిల్లల అవసరాలు చూసుకుంటూ ఉండగానే భర్త ఇన్సురెన్స్ డబ్బులు రూ.4.35 లక్షలు వచ్చాయి. మూడు లక్షల రూపాయలతో 2015లో కూతురికి పెళ్లి చేసింది.

ఆదాయం సరిపోక..

టీ స్టాల్ నడుపుతూ కుటుంబాన్ని లాక్కొస్తున్న నజ్మాకు డబ్బులు సరిపోయేవి కావు. కూతురి పెళ్లి తరువాత ఆర్థిక ఇబ్బందులు పెరిగాయి. దీంతో భర్త ఇన్సురెన్స్ డబ్బుల్లో మిగిలిన మొత్తంతో ఎలక్ట్రిక్ ఆటో కొనుక్కుంది. ఇంటి పనులన్నీ పూర్తిచేసి ఆటో తోలుతూ సంపాదిస్తోంది.


అర్ధరాత్రైనా భయం లేదు

నజ్మా మూడు షిఫ్టుల్లో ఆటో నడుపుతోంది. బురఖా ధరించి ఉదయం తొమ్మిదిగంటలకు ఆటో స్టార్ట్ చేస్తుంది. ఎండ వేడికి బురఖాలో ఎక్కువ సమయం ఉండలేక మధ్యాహ్నం ఒంటి గంటకు ఇంటికి వచ్చేస్తుంది. తిరిగి సాయంత్రం ఆరు గంటల నుంచి రాత్రి ఎనిమిది వరకు ఆటో నడుపుతోంది. మళ్లీ రాత్రి తొమ్మిది నుంచి రెండుగంటల వరకు విరామం లేకుండా నడుపుతుంది. ఇలా మూడు షిఫ్టుల్లో మొత్తం మీద రోజుకి ఐదు నుంచి ఆరు వందల వరకు సంపాదిస్తోంది. స్థానిక ట్రాఫిక్ పోలీసులు నజ్మా ధైర్యాన్ని మెచ్చుకుని ప్రోత్సహిస్తున్నారు. అయితే నజ్మాను చూసిన ఓ హిందూ మహిళ కూడా ఆటో నడపడం మొదలు పెట్టింది. దీంతో ఆ మహిళ ఆర్థిక పరిస్థితులు కూడా మెరుగు పడ్డాయి. ఇలా ఇతరులకు స్ఫూర్తి నిలుస్తూనే, తన కష్టార్జితంతో హజ్ యాత్రకు వెళ్తానని చెబుతోంది నజ్మా.

అడుక్కునే కంటే...

"పేదరికం ఉందని అక్కడా ఇక్కడా చేయి చాచకుండా కష్టపడి ఏ పనైనా చేసి గౌరవంగా బతకవచ్చు. ఆటో గేర్లు మారుస్తూ, ప్రయాణికులను గమ్యాలకు చేరుస్తున్నాను. ఇక మహిళా డ్రైవర్‌గా నాకు రాత్రి సమయాల్లో కూడా ఎటువంటి ఇబ్బంది ఎదురు కాలేదు. ముఖ్యమంత్రి యోగి ప్రభుత్వం వచ్చాక అర్ధరాత్రి బయటకు రావడానికి కూడా భయం వేయడం లేదు. ప్రభుత్వ అధికార యంత్రాంగం మాకు రక్షణ కల్పిస్తోంది. పరిస్థితులు మరింత దిగజారినప్పుడు అల్లా కాపాడతాడు" అని నజ్మా అన్సారీ ధైర్యంగా చెబుతోంది.

బ్యూటిప్స్



● వేప చెట్టు ఇంటి దగ్గర్లో ఉంటే వేరే సౌందర్యసాధనాలతో పనే ఉండదు. వేపాకులు, బెరడు, వేపనూనె ఔషధాలుగానే కాదు, సౌందర్య సాధనాలుగానూ ఉపయోగపడతాయి. ఎలాంటి చర్మ సమస్యలకైనా వేపతో ఇట్టే చెక్ పెట్టేయవచ్చు. ● ముఖంపై మొటిమలు, నల్లమచ్చలు ఏర్పడుతుంటే వేపాకులతో చక్కని విరుగుడు ఉంది. గుప్పెడు వేపాకులను అరలీటరు నీటిలో వేయాలి. వేపాకులు పూర్తిగా మెత్తగా మారిపోయేంత వరకు ఆ నీటిని మరిగించాలి. కాసేపటికి నీరు ఆకుపచ్చ రంగులోకి మారుతుంది. అప్పుడు వడగట్టి ఆ కషాయాన్ని సీసాలో భద్రపరచుకోవాలి. ప్రతిరోజూ రాత్రి పడుకునే ముందు ఆ నీటితో కాస్త దూదిని తడిపి ముఖాన్ని రుద్దుకుంటే చాలు. మొటిమలు, మచ్చలు మటుమాయం అవుతాయి. ● చర్మం పొడిబారి, తరచు దురదలు పెడుతున్నట్లయితే, పైన చెప్పుకున్నట్లే వేపాకులతో కషాయం చేసి, బకెట్ నీటిలో ఒకకప్పు కషాయాన్ని పోసి ఆ నీటిని స్నానానికి ఉపయోగిస్తే చాలు, కొద్దిరోజుల్లోనే చర్మం ఆరోగ్యకరంగా మారుతుంది. ● ముఖం తరచు జిడ్డుగా మారుతుంటే, వేపాకుల పొడి, గంధంపొడి, గులాబి రేకుల పొడి సమభాగాలుగా తీసుకుని కలుపుకోవాలి. చెంచాడు పొడిలో మూడు నాలుగు చుక్కల వేపనూనె, కొద్దిగా తేనె, నిమ్మరసం పిండుకుని ముద్దలా కలుపుకోవాలి. దానిని ముఖానికి పట్టించి, అరగంటసేపు ఆరనివ్వాలి. పూర్తిగా ఆరిన తర్వాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి. ఇలా చేస్తే ముఖం తాజాగా మారుతుంది.

